# రెండు దార్లకీ మలుపు ఒకటే

షాపులోంచి బయటికొస్తూ ఆగిపోయింది దయ.

బైట వర్షం పడుతోంది. పొద్దుట్నించి మబ్బులుపట్టి దిగులుగావున్న ఆకాశం ఒక్కసారిగా దుఃఖం బద్దలై కన్నీళ్ళు కారుస్తోంది. వర్షం పెద్దదే పడుతోందని ఆ పక్కనేవున్న రేకుమీద చినుకుల శబ్దమే చెప్తోంది. నీరు అప్పుడే కాలువలుకట్టి పారుతోందికూడా. బజార్లో జనం కొట్లమీదకీ, చూరుల కిందకీ చేరుకుని నిర్లిప్తంగా వర్షంకేసి చూస్తున్నారు.

దయ గుమ్మందగ్గరే ఆగిపోయింది. వర్షం తగ్గితే వెళ్ళిపోదామని ఎదురు చూస్తోంది.

చూస్తోన్న ఆమెకు, అక్కడ కొట్టు అరుగుమీద వర్షంనించి రక్షణగా నిల్చున్న అయిదారుగుర్లోనూ సుధాకరం కనిపించాడు. వర్షంలో కొద్దిగా తడిసినట్టున్నాడు. జేబురుమాలుతో వొళ్ళు తుడుచుకుని ఆ తడిరుమాలుని పిండుకుంటున్నాడు.

ఏడాదిలో సుధాకరం ఎంతగా మారిపోయాడో చూస్తోంటే ఆమెకే ఆశ్చర్యంగా వుంది.

ఆ మార్పుకు కారణం ఆమెకు తెలుసు.

కాలేజీలో చదువుకునే రోజుల్లో జయంతితో అతను చాలా చనువుగా వుండేవాడు. జయంతి చేతిలో అతని పేరు వ్రాసివున్న పుస్తకాల్ని ఎన్నోసార్లు చూసింది దయ. అతని నోట్సులు కూడా ఆమెదగ్గర వుండేవి. కాలేజీనించి కొంతదూరం వరకూ వాళ్ళిద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళడం కూడా అనేకసార్లు చూసింది దయ. వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారని అమ్మాయిలు

చెవులు కొరుక్కునేవారు. రిజల్ట్సు వచ్చిన వెంటనే పెళ్ళి చేసుకుంటారని కూడా వార్తలు వ్యాపించాయి. ఆ వార్తలు గాలివార్తలే అయ్యాయి. ఒకానొక మేనెల పొడివుదయంవేళ పోస్టుమేన్ జయంతి పెళ్ళి శుభలేఖ యిచ్చి వెళ్ళాడు. అయితే అందులో వరుడు మాత్రం సుధాకరం కాదు!

సుధాకరంలో వచ్చిన మార్పుకు కారణం యిదే కావచ్చు. చూడగానే అతనిలో యీ మార్పు స్పష్టంగా కనిపించిపోతోంది. టక్ చేయకుండా లూజుగా చొక్కాని పేంటు మీదకు వొదిలేయడం, గెడ్డం మానినట్టు కని పిస్తున్నా షేవ్ చేసుకోకపోవడం, అరిగిపోయి దుమ్ము కొట్టుకుపోయిన సాదా ఆకుజోళ్ళను తొడుక్కోవడం, నాజూగ్గా రెండో మూడో పుస్తకాలు పట్టుకో డానికి అలవాటుపడ్డ చేత్తో మాసిపోయిన గుడ్డ సంచిని పట్టుకోవడం—దయ ఏడాదికి ముందు ఎప్పుడూ చూడలేదు. చెట్టునపండిన బత్తాయిలా అప్పుడతను వుండేవాడు. ఇప్పుడు రాలిపోయి ఎండకొట్టుకుపోయి కమిలిపోయిన టమో టాలా అయిపోయాడు.

వర్షం వుండేకొద్దీ పెద్దదవుతోంది. అరుగుమీద నుంచున్నవారు మెల్లగా కొట్లోకి చేరుకున్నారు. సుధాకరం మాత్రం యింకా అక్కడే వర్షపు జల్లుకి తడుస్తూ ఒక పక్కకి గోడదగ్గరగా అతుక్కుపోయి నిల్చున్నాడు. వర్షపు జల్లుకి పేంటు అడుగంతా తడిసిపోయి నీరు కారుతోంది. చొక్కామీద కూడా చినుకులుపడి తడిసిన మచ్చలు కనిపిస్తున్నాయి.

అతను లోపలకు ఎందుకురాడో దయకు అర్థంకాలేదు. అంతా లోపలి కొస్తే తనొక్కడూ తడుస్తూ అక్కడే వుండిపోవడం ఏమిటి?

ఎవరో అతన్ని లోపలకు రమ్మన్నారుగాని అతను వినిపించుకోలేదు. తననుచూసే అతను అక్కడ వుండిపోయాడనుకుంది దయ. కాలేజీ విడిచి పెట్టాక పదీపదిహేనుసార్లన్నా అతను కనిపించాడుగాని ఎప్పుడూ చూసీ చూడనట్టే వెళ్ళిపోయేవాడు. జయంతి కారణంగా అతను జీవితంలో దొంగలా తప్పించుకు తిరగటం నేర్చుకున్నట్టున్నాడు!

'సుధాకరంగారూ! వర్షంలో తడుస్తున్నట్టున్నారు, లోపలికి రండి.'

సుధాకరం యిటు చూశాడు. అతని కళ్ళలో ఆశ్చర్యంలేదు. తనను అంతకుముందే అతను చూశాడని ఆమెకు అర్థమైంది. తనదికాని తప్పుకు అతను సిగ్గుపడడంచూస్తే ఆమెకు జాలేసింది. జయంతిని పెళ్ళాడివుంటే ను ఖిలా లోకాన్ని చూసి తప్పుకు తిరిగేవాడా? ఎంత పిరికివాడైపోయాడు!

'బావున్నారా. ఇప్పుడేం చేస్తున్నారు — ఎం ఏ. చదువుతున్నారా ?' అంటూ లోపలికొచ్చాడు సుధాకరం. అతను సన్నగా వణకడం కనిపించింది ఆమెకు.

'అప్పుడు బి.ఏ. అత్తెసరు మార్కులతో పాసయ్యానండి. అందుకని ఎం ఏ.లో సీటు దొరకలేదు. మొన్న సెప్టెంబరులో గ్రూపు మార్చుకుని మళ్ళీ వెళ్ళాను. మార్కులు బాగానే వచ్చాయి. వచ్చే జూన్‌లో యూనివర్సిటీలో చేరతాను.' అంది దయ. ఆ తర్వాత వెంటనే 'మీరేం చేస్తున్నారు.... .... యూనివర్సిటీలో చదువుతున్నారా ?' అంది.

'లేదండీ' అన్నాడు చాలా దిగులుగా. ఆలోచనల్తో గతాన్ని తడుముకుంటూ చాలా సేపు అలానే వుండిపోయాడు.

వర్షం అలా పడుతూనే వుంది. చాలావరకు మేఘం తేలిపోయింది. ఆ మిగిలిన దుఃఖాన్ని కూడా కక్కేస్తే ఆకాశం తేలికపడొచ్చు. కాస్సేపట్లో వర్షం వెలిసిపోయ్యే సూచనలే కనిపిస్తున్నాయి. గట్టిగా గొంతు చించుకొని ఏడ్చేవాళ్ళు ఎంత సేపని ఏడవగలరు ?

'ఇప్పుడు ఏం చేస్తున్నారు సుధాకరంగారూ ?'

'డి.ఇ.ఓ. ఆఫీసులో గుమాస్తాగా చేరానండి.'

దయకు ఆశ్చర్యంవేసింది. జయంతి పక్కనే ఠీవిగా కాలేజీ ఆవరణలో నడిచే యీ సుధాకరాన్ని ఆనాడు చూసిన వెళ్ళెవరూ ముందు ముందు ఆయన్నో ఆఫీసు గుమాస్తాగా వూహించి వుండరు. దానికి కారణం—జయంతి అందమే కావచ్చు. లేదా, చదువేనా కావచ్చు. సుధాకరాన్ని గూర్చి అంతగా ఎప్పుడూ ఆలోచించలేదుగాని అతన్ని గుమాస్తాగా మాత్రం చూస్తానని కలలో కూడా ఊహించలేదు దయ.

సుధాకరంతో చాలా విషయాలు మాట్లాడాలని వుంది. కాని అక్కడ వున్న జనం, వాళ్ళ సంభాషణ చాలా ఆసక్తిగా వింటున్నారు. అదామెకు చిరాకు కల్గించింది. ఏం చేస్తారు మరి, ఆ వర్షపు సాయంకాలం నిర్మానుష్యమైన బాటలో మరో కాలక్షేపమేదీ వాళ్ళకు కనిపించలేదు! పైగా ఆ షాపు ఫ్యాన్సీషాపు అయితే కాస్తోకూస్తో కాలక్షేపంగా వుండేది. కాని అది మందుల షాపు!

చూసిచూసి ఓ యిద్దరు వర్షంలో తడుస్తూనే రిక్షా కట్టించుకుని వెళ్ళిపోయారు. సగం తెరిపి యిచ్చినట్టయ్యింది. మిగతావాళ్ళున్నా ఏదో సినిమా చర్చల్లో పడ్డారు.

'ఆఫీసునించి వస్తున్నారా?'

'అవునండి. ఇదిగో యిక్కడికి వచ్చేసరికి యీ వర్షం తగలడింది. మీరిలా వచ్చారేం?' అన్నాడు సుధాకరం.

'మా నాన్నగారికి వంట్లో బాగోలేదు. మందులు కావలసివస్తే వచ్చాను' అంది దయ.

కొట్లో దీపాలు వెలిగించారు. సుధాకరం ఓసారి బైటికివచ్చి చెయ్యిచాపి వర్షం తగ్గిందేమోనని చూశాడు. తగ్గినట్టే అనిపించింది. ఎక్కిళ్ళు పడుతున్నట్టు కురుస్తోంది వర్షం. ధారలా పడడంలేదు. బొట్లుబొట్లుగా పడుతోంది—ఏడ్చి ఏడ్చి ఎక్కిళ్ళు పడ్తున్నట్టు.

మరో అయిదు నిమిషాలు చూసి వర్షం బాగా తగ్గాక యిద్దరూ బయలుదేరారు. అతను వెళ్ళిపోబోతోంటే ఆపింది. తనుకూడా బస్సులోనే వస్తానని. జయంతిని గురించి తెలుసుకోవాలనుంది ఆమెకు. జయంతి ఎవ్వరినీ లక్ష్యపెట్టేది కాదు. ఆ నిర్లక్ష్యాన్ని ప్రకటించుకోవడానికే ఆమె సుధాకరంతో స్నేహం చేసివుండాలని దయ అభిప్రాయం. నలుగురి కళ్ళూ కుట్టడానికని సుధాకరాన్ని వుపయోగించుకుని వుండాలి.

బస్‌స్టాపు ఫర్లాంగు దూరంలోనే వుంది. నీరు కాలువలు కట్టిన రోడ్డు మీద మెల్లగా నడుస్తున్నారు.

'మిమ్మల్ని రెండు మూడు సార్లు యూనివర్సిటీ రోడ్డులో చూశానండి. మీరు ఎం.ఏ. చదువుతున్నారేమో అనుకున్నాను. ఇంతకూ ఎందుకని చవడం లేదు ? మీకు బి.ఏ.లో కూడా మంచి మార్కులు వస్తుండేవికదా' అంది దయ.

సుధాకరం ఆశ్చర్యంగా చూసి 'నేను తెలివైనవాడినని ఎవరన్నారు. నేనుకూడా మీలా అత్తెసరు మార్కులవాడినే' అన్నాడు.

ఆమె తల అడ్డంగా తిప్పి 'మీరు కాదన్నంత మాత్రంచేత నమ్మేది లేదులెండి. మీ గురించి మాకు జయంతి చెప్తుండేది' అంది.

అతను బెదిరినట్టు చూశాడు. అతని కళ్ళల్లో దిగులుని దీపస్తంభం కాంతికింద కూడా ఆమె స్పష్టంగా చూడగలిగింది. అతను జీవితాన్ని తడుము కుంటున్నాడు. పగిలిపోయిన ఆలోచన్ల గాజుమేడ ముక్కలు గుచ్చుకుని చిమ్మిన రక్తంలాటి వెచ్చటి బాధని తుడుచుకుంటున్నాడు.

ఆ స్థితిలో అతన్ని చూసినప్పుడు దయకు జాలేసింది. జయంతి ప్రస్తావన తేకుండా వుండాల్సింది—అనుకుంది.

'మిమ్మల్ని గుమాస్తాగా చూస్తామని మేమెప్పుడూ అనుకోలేదు సుధాకరంగారూ. ఇంకా మీరు....'

సుధాకరం మధ్యలోనే అందుకుని 'మేమంటే?' అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు.

'మేమంటే—మా అమ్మాయిలమంతా. ఆ రోజుల్లో మిమ్మల్ని జ—' దయ ఆగిపోయింది. మళ్ళీ జయంతి ప్రస్తావనే దొర్లుతోంది!

సుధాకరం తలెత్తి దయ ముఖంలోకి చూసి దించుకున్నాడు. అతని పెదాలమీద నవ్వొకటి విరిసింది. మరీ జాలిగా తనను తానే మోసం చేసుకునేంత జాలిగా వుందా నవ్వు.

బస్‌స్టాపు దగ్గరకొచ్చారు. అక్కడి జనం వాళ్ళవైపే గుచ్చిగుచ్చి చూస్తున్నారు. వాళ్ళు అలా చూడ్డం దయకు ఇబ్బందిగా వుంది. నిజమే. ఒకప్పుడు జయంతి పక్కన ఎంతో హుందాగా, ధైర్యంగా, నీటుగా నిలుచున్న సుధాకరం కాదు యీనాడు తనపక్క బితుగ్గా, బిడియంగా, అతి సాదాగా నిల్చున్న ఈ సుధాకరం. ఇప్పుడు వీళ్ళందరి చూపులవారగా చూసుకుంటుంటే

అతని పక్కన నిల్చోవడం తనకే ఏమిటోలా వుంది. మోకాళ్ళవరకు తడిసి పోయి ముసలితనం వచ్చేసినట్టు ముడతలుపడ్డ పేంటూ, ఎబ్బెట్టుగా పొడు గంతా కన్పించే టక్ చేయని షర్టూ, బీదతనాన్నికాక అతని నిర్లిప్తతని చూపు తున్నట్టు షర్టుకి బొత్తాలులేక కన్పించే ఛాతీ, తనను తానే మర్చిపోయినట్టు చెప్పే తుట్టలా పెరిగిపోయిన తలా, తలమ్ముకున్నప్పటి బండ చాకిరీకి నిదర్శనంగా ఫైల్సు కనిపిస్తోన్న మామూలు గుడ్డసంచీ, వీటన్నిటికీ తోడు అతని బెదురు చూపులూ, జాలి ముఖమూ, అప్పుడప్పుడు ఆరోగ్యంలేని నవ్వూ—ఇవన్నీ వున్న యిటువంటి వ్యక్తిని తనపక్క చూడడం, చూసే వాళ్ళకి ఎబ్బెట్టుగా అనిపించడం సహజమే.

దయ ఒకసారి తనవేపు తాను చూసుకుంది. ఆ దగ్గర్లోని రోడ్డు మధ్య వెలుగుతోన్న మెర్క్యురీదీపం కాంతిలో తనను తాను చూసుకున్నప్పుడు కొద్ది సేపు ఆమె అక్కడి పరిసరాల్నీ, చివరకు తన పక్కనే వున్న సుధాకరాన్ని సైతం మర్చిపోయింది. అందుకే దాసు తనని జాజిమొగ్గతో పోల్చాడు అను కుంది. తనలో తనే నవ్వుకుంది. ఎంతో ఉల్లాసంగా గుండె నిండా గాలిపీల్చు కుంది. ఆలోచనల్లోంచి తేరుకొనే సరికి ఆమెకు సుధాకరం మాటలు వినిపించాయి—

'ఏం బస్సులో ఏమో, మన బతుకుల్లాగే అవీ తిన్నగా నడవ్వుకదా.'

ఆమె ఆలోచనల చుట్టూ ఎగురుతోన్న సన్నజాజుల పరిమళం ఎగిరి పోయింది. ఆమె కళ్ళముందు కదులుతోన్న సన్నజాజుల తెల్లదనం తొలిగి పోయింది. ఆమె మనసులో చిరుగాలికి సైతం పులకరించిపోతున్న జాజితీగ ఆనందం నిలిచిపోయింది. మళ్ళీ ఆమె కళ్ళముందు సుధాకరం, అతని వంకర జీవితం, ఆమె మనసులో నిరుత్సాహం, సుధాకరం మీద జాలీ.

పాపం! నాలాగే యితను కూడా ఒకప్పుడు ఎన్నో కలల్నికనేవాడు కాబోలు. అందుకే అతను అంత ఆరోగ్యంగా నవ్వగలిగేవాడు. ఠీవిగా తల పైకెత్తి నడవగలిగేవాడు. కాని జయంతి అతని కలల్ని చెరిపేసి అతని చిరు నవ్వుని విరిచేసింది. అతని మెడను వంచేసింది. పాపం! సుధాకరం ఎంత దురదృష్టవంతుడు—అనుకుంది దయ.

బస్సొకటి వచ్చింది. తోసుకుని ముందుకు పోగలవాళ్ళను ఎక్కించుకుని మిగిలిన వాళ్ళను వొదిలేసి వెళ్ళిపోయింది. ముగ్గురు నలుగురు రిక్షాలు చేయించుకుని వెళ్ళిపోయారు. బస్సు స్టాపులో దయా, సుధాకరం కాక మరో ముసలాయన మాత్రమే మిగిలారు.

'మీకు బాగా ఆలస్యమౌతున్నట్టుంది, మీరుకూడా రిక్షాలో వెళ్ళిపోగూడదూ, బస్సొచ్చాక నేను మెల్లగా వెళ్తాలెండి' అన్నాడు సుధాకరం.

'పెద్దగా కంగారేంలేదులెండి. స్నేహితురాలి దగ్గరకని వచ్చాను. ఎలాగూ బజార్లోకి వచ్చానుకదాని నాన్నగారికి ఏవో మందులు కొవాల్సివుంటే వెళ్ళికొంటున్నాను. ఇంతలోకి యీ వర్షం పట్టుకుంది. ఇంకో బస్సుకూడా చూసి రిక్షాలో వెళ్ళిపోతాలెండి' అంది. ఆ తర్వాత మళ్ళీ వెంటనే 'మీకేమన్నా అర్జంటు పనివుందా ?' అంది.

'భోంచెయ్యడమే ఓ అర్జంటుపని. రేపొద్దున్న మళ్ళీ ఆఫీసుకి రావడమే ఓ అర్జంటుపని. ఇంతకుమించిన అర్జంటుపనులు నాకేంలేవండి.'

'అవునుగానీ చేరకచేరక ఇలాంటి ఉద్యోగంలో చేరారేమిటండీ ?' అంది దయ.

'పొట్టగడవడానికి నాలుగు రాళ్ళు సంపాదించుకోవాలి కదండీ' అన్నాడు సుధాకరం.

ఆ సమాధానం తర్వాత ఆమె మరింకేమీ మాట్లాడ లేకపోయింది. సుధాకరం పొట్టగడవక, దొరికిన ఏదో ఒక ఉద్యోగంలో చేరాడా ? ఇది నిజమా ? ఈ బీదతనమే అతన్ని జయంతినుంచి వేరుచేసిందా ?

దయ చాలా సేపు ఆలోచించింది. ఆలోచిస్తూ చటుక్కున యిటుతిరిగి 'అన్నట్టు, సుధాకరంగారూ ! మీరు ఏవన్నా కాంపిటీటివ్ పరీక్షలకి కూచోలేకపోయారా, చాలా మంచి వుద్యోగాలు వస్తాయికదండీ' అంది.

'అంత ఓపిక లేదండీ' అన్నాడు—చాలా నిర్లిప్తంగా.

'మీరు చాలా మారిపోయారు సుధాకరంగారూ ! వెనకటి రోజుల్లో అయితే మీరిలా అనుండేవారు కాదు. మీ ఆలోచనల్లోనే చాలా మార్పు వచ్చింది'

సుధాకరం ఏమీ మాట్లాడలేదు.

'ఓటమి ఎప్పుడూ జీవితానికి పుటంపెట్టినట్టు కావాలిగానీ దాన్ని కుంచించుకుపోయేలా చేయకూడదు. కాదంటారా ?'

అతను ఏమీ అనలేదు.

'చూడండి సుధాకరంగారూ. మీకు సలహా యిచ్చేంత చనువు నాకు లేదుగానీ ఒక విషయం మాత్రం చెప్తాను—మీరు ఏమనుకున్నాసరే. మీ పరిస్థితుల్లోనేగాని నేను వుండివుంటే మీలా ప్రవర్తించేదాన్ని కాదు'

సుధాకం ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూశాడు.

'జీవితంలో కోరుకున్నవన్నీ దొరక్కపోవచ్చు. అలాంటప్పుడు బాధ కలగడం సహజమే కాని, ఎప్పుడూ దాన్నే తలంచుకుంటూ జీవితం పొడవునా బాధపడడం మంచిది కాదు. బస్సు రాకపోవడానికి, కాఫీ సహించకపోవడానికీ — యిటువంటి అతి మామూలు చిన్నచిన్న విషయాలకు కూడా ఓటమినే గుర్తుచేసుకుని, దాన్నే అన్వయింప జేసుకోవడం తెలివిలేనివారు చేసే పని. ఎందుకంటే నిరాశ, జీవితాన్ని ఎందుకూ పనికిరాకుండా చేస్తుంది. అది ఉప్పునీటిలాగ జీవితాన్ని చౌడుదేరుస్తుంది. ఏ సారమూ లేకుండా బ్రతికేవారు తమకేగాక యితరులకి కూడా ఎందుకూ ఉపయోగించరు.'

సుధాకరానికి జ్ఞాపకాల ముళ్ళు గుచ్చుకున్నాయేమో అరచేత్తో అతను ముఖాన్ని తడుముకున్నాడు. జేబు రుమాలుతో తుడుచుకున్నాడు. చల్లగా తగిలించది.

'బస్సు యిప్పట్లో వచ్చేట్టులేదు, మీరు రిక్షాలో వెళ్ళిపోగూడదూ' అన్నాడు సుధాకరం. అతనికి ఈ సంభాషణ బాధకలిగిస్తోందని ఆమెకు అర్థమైంది.

దయ రిక్షాను పిలిచి బేరమాడింది. రిక్షా ఎక్కేముందు 'అన్నట్టు, వారం రోజుల కిందట ఫైవియర్ ప్లాన్ పబ్లిసిటీ వాళ్ళు ఏవో ఉద్యోగాలకి అడ్వర్టైజ్ చేశారు. మీరు అప్లయ్ చేయకూడదూ. రెండు మూడు రకాల ఇంగ్లీషు డెయిలీలు తిరగేస్తే ఆ అడ్వర్టైజ్‌మెంటు కనిపిస్తుంది. అంతగా మీకు

కావాలంటే కటింగ్ తీసి వుంచుతాను, ఎప్పుడైనా దగ్గర్లో ఒకసారి మా ఇంటికి రండి. మా ఇల్లు తెలుసుకదూ.'

'ఇల్లు సరిగ్గా తెలీదు. పార్కు ఎదురుగ్గావున్న సందులో కాబోలుకదా.'

'అదే, ఆ సందులోనే. మా నాన్నగారి పేరు చెప్పండి—రిటైర్డ్ రైల్వే గార్డు జ్ఞానరత్నంగారి యిల్లంటే ఎవరన్నా చూపిస్తారు. వీలు చూసుకుని రండి' అంది. రిక్షాఎక్కి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ కూడా ఓ సారి వెనక్కు తిరిగి 'ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేయడం మాత్రం మర్చిపోకండి' అని మళ్ళీ జ్ఞాపకం చేసింది.

అలాగే అన్నట్టు అతను తలూపాడు.

దయ యింటికొచ్చి పాత పేపర్లన్నీ తిరగేసి ఆ ప్రకటన కటింగ్ విడిగా తీసిపెట్టింది.

కాని సుధాకరం రాలేదు.

ఆ తర్వాత కూడా అతను ఆమెకు కనిపించలేదు.

ఆరోజు వర్షం వచ్చిన సాయంకాలం కనిపించడమే కనిపించడం. ఆ తర్వాత మళ్ళీ రెండేళ్ళకుగాని అతను కనిపించలేదు. అది కూడా చాలా చిత్రంగానే జరిగింది—

సమితి ఆఫీసులో ప్రసిడెంటు ఎదుట ఒకానొక అసహ్యకరమైన సన్నివేశంలో జరిగింది.

స్కూల్లో సైన్సు అసిస్టెంటు అవమానకరంగా ప్రవర్తిస్తుంటే చాలా కాలం సహించి చివరికి సమితి ప్రసిడెంటుకు రిపోర్టుచేసింది దయ. ఆయన హెడ్‌మాస్టరునూ, దయనూ, ఆ సైన్సు మాస్టరునూ పిలిపించి ఆ విషయమే వాకబు చేస్తున్నాడు. ఆ సైన్సు మాష్టారు మొదటినుంచీ తనమీదే విసుర్లు విసరడం, నలుగురికీ చెడుగా ప్రచారం చెయ్యడం, ముగ్గురుపిల్లల తండ్రయినా అతను తనకు ప్రేమలేఖ రాసి పంపించడం—అన్నీ ఏకరువు పెట్టింది దయ. ఆమె ఆ విషయం చెప్తున్నప్పుడు తనను తాను నిగ్రహించుకో లేకపోయింది. కోపంతో ఆమె వణికిపోయింది దుఃఖంతో ఆమె కంఠం బొంగురు పోయింది. కళ్ళల్లో నీళ్ళు కూడా తిరిగినట్టున్నాయి, కళ్ళు తుడుచుకుంది.

అంతవరకూ ఆమె ప్రెసిడెంటు ఎదుట కుర్చీలో కూచున్న వ్యక్తిని గురించి అంతగా పట్టించుకోలేదు. ఆయనే మూడు నాలుగుసార్లు వెనక్కి తిరిగి చూశాడు. అప్పుడు గుర్తుపట్టింది—అతను సుధాకరం అని.

సుధాకరాన్ని అక్కడ చూసేసరికి ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది. అక్కడిక నిలుచో లేకపోయింది. దానికితోడు ఆ సైన్సు అసిస్టెంటు తనను తాను సమర్థించుకోవడానికి చాలా నీచంగానూ, అసహ్యంగానూ మాట్లాడుతున్నాడు.

'అతనిమీద తగినచర్య తీసుకుంటే సరేసరి, లేకపోతే నేను ఉద్యోగానికి రాజీనామా చేసేస్తానండి' అని ప్రెసిడెంటుతో కాస్త తీవ్రంగానే చెప్పి చరచరా అవతలకు వెళ్ళిపోయింది దయ.

ఆమెకు ఆ సమితి ఆఫీసులో ఒక్క క్షణంకూడా నిలుచోవాలనిపించ లేదు. సుధాకరం వొచ్చి కలుస్తాడేమోనని ఆమె భయం. అలాటి పరిస్థితుల్లో సుధాకరం అక్కడ వుండడం ఆమెకు చాలా సిగ్గుగావుంది. మనసులో అసహనంగా వుంది. అవమానంతోనూ, బాధతోనూ నిండివుంది. స్కూలుకు కూడా వెళ్ళాలనిపించలేదు. ప్రెసిడెంటు మధ్యాహ్నం విరామసమయంలో వాకబు చేస్తానంటే స్కూలునించి వచ్చింది. మళ్ళీ స్కూలుకు వెళ్ళవలసి వుంది. కాని యిప్పుడు మనసేం బావుండలేదు. ఇంటికివెళ్ళి గట్టిగా ఏడ్చెయ్యాలనివుంది. ఈ మబ్బుపట్టిన మనసుతో స్కూల్లో ఎలాగని కూచోటం? జట్కా కట్టించుకుని యింటికి వెళ్ళిపోయింది.

వేళకానివేళలో వచ్చిన కూతుర్ని చూసి తల్లి ఆశ్చర్యపోయింది. తల నొప్పిగా వుందనిచెప్పి తలుపులు మూసుకుని పక్కమీద వాలిపోయింది దయ. కళ్ళను వొత్తులు చేసుకుని గతాన్ని ఒకసారి తిరగతోడుకుంది. కొవ్వొత్తి నించి కరిగి జారే మైనపుబొట్లులాగ కన్నీరు ఆమె చెంపలమీదికి జారి పోయింది. అలాగే ఆమె ఆలోచిస్తూ ఆలోచిస్తూనే నిద్రపోయింది.

నాలుగు గంటలవేళ ఎవరో వచ్చారని వాళ్ళమ్మ గట్టిగా మూడునాలుగు పిలుపులు పిలిస్తే లేచొచ్చి కిటికీలోంచి చూసింది.

సుధాకరం జీపుదిగి కిటికీలోకి చూసి ఆమెను విష్ చేశాడు.

'ఇప్పుడే వస్తున్నా. లోపలకొచ్చి కూచోండి' అని చెప్పి గబగబా అద్దం ముందుకెళ్ళి చెదిరినజుత్తు సరిదిద్దుకోబోయి చటుక్కున ఆగిపోయింది దయ. ముఖమంతా జిడ్డుగావుంది. కళ్ళకింద కన్నీటి చారిక కూడా ఓచోట కనిపిస్తోంది. 'ఇది సుధాకరం కళ్ళబడలేదుకదా' అనుకుంది అసలే మధ్యాహ్నం సంఘటనతో ఆమె మనసంతా సిగ్గుతో ముద్దయిపోయింది. చెయ్యరాని మహాపచారం చేసిన దానిలాగ అతని ముందుకు వెళ్ళడానికి ముఖం చెల్లక చాలాసేపు అలాగే వుండిపోయింది. ఆ తర్వాత తేరుకుని హడావిడిగా ముఖం కడుక్కుని, చీరకూడా మార్చుకుని వచ్చింది.

'బావున్నారా ?' అంటూ పలకరించింది. పలకరించడమైతే పలకరించిందిగాని తలెత్తి అతని ముఖంలోకి చూడనైనా చూడలేదు. అందువల్ల, అతను 'బావున్నాను' అన్నట్టు తలతిప్పినవాడల్లా అదే విషయాన్ని నోటితో కూడా చెప్పాల్సివచ్చింది.

'ఏదో మీ దయవల్ల బాగానే వున్నాను'

'ఉండక ఉండక నాదయే వుండాలా' అంది ఆమె తనలోతనే అనుకుంటున్నట్టు. అతనికి సరిగా వినిపించలేదు. ఏమిటో అడుగుతుందేమోనని 'ఏమిటి అడిగారూ' అన్నాడు.

'ఏమీలేదులెండి........ఇలా యీవూరొచ్చారేమిటి ? ప్రసిడెంటుగారు తెలుసా ?' అంది.

'ఆఫీసు పనిమీద వచ్చాలెండి. ఫీల్డు పబ్లిసిటీ ఆఫీసరుగా పనిచేస్తున్నాను. మీ సమితిలో సినిమా ఒకటి వేయమంటే వచ్చాను' అన్నాడు సుధాకరం.

'మొత్తంమీద మీరు ఆ గుమాస్తా వుద్యోగంనుంచి తప్పుకున్నారన్న మాట.'

'ఏదో మీ దయవల్ల'

దయ మొదటిసారిగా పట్టిపట్టి అతన్ని చూసింది.

సుధాకరం చాలా మారిపోయాడు. మాటలు నేర్చాడు. బితుకు బితుకుగా, బెదురుగా, దిగులుగా మాట్లాడిన ఆ సుధాకరం కాదు యీ సుధాకరం—అనుకుంది దయ.

ఆమె పట్టిపట్టి చూడ్డం చూసి సుధాకరం "అప్పుడెప్పుడో ఒకసారి మనం కలుసుకున్నప్పుడు ఓ ఉద్యోగం గురించి చెప్పారు చూడండీ ఆ ఉద్యోగమే యిది. మీ సలహాని పాటించి వెంటనే అప్లయ్ చేశాను. ఉద్యోగం వచ్చింది. ఒక ఏణ్ణర్థంపాటు ఒరిస్సాలో పనిచేసి ఆర్నెల్లకిందటే తిరిగి విశాఖపట్నం వొచ్చాను. ఇదంతా మీ చలవే" అన్నాడు.

చాలాకాలం క్రితం ఒక వర్షపు సాయంకాలం సుధాకరంతో తను అన్న మాటలు గుర్తుకొచ్చాయి ఆమెకు.

ఆమె జాలిగా తనలోతనే నవ్వుకుంది.

'మీరు ఎం.ఏ. చదువుదామనుకుని మళ్ళీ బి.ఇడి. వైపు వచ్చారేం?' అన్నాడు సుధాకరం.

'బి.ఇడి. కూడా కాలేదు. అన్‌ట్రైన్డు టీచర్‌గా పనిచేస్తున్నాను.' అంది ఆమె.

'అదేమిటీ! మీరు యింకా పైకి చదువుతానని చెప్పారుకదా నాతో.'

'చెప్పాను కానీ అన్నీ మనం అనుకున్నట్టు జరగవుకదండీ. అందరూ అదృష్టవంతులే వుంటారా.'

ఎవరు! దయేనా యిలా మాట్లాడుతోంది?—అనుకున్నాడు సుధాకరం. ఇంతమాత్రానికే యింత దిగులేమిటి ఈమె మాటల్లో? జీవితానికి యిదొక్కటే ముఖ్యమైనట్టు, అది నెరవేరకపోతే జీవితమే వ్యర్థమైనట్టు ఏమిటీ దిగులు?

దయనే చూస్తున్నాడు. ఆమెలో చాలా మార్పు కనిపిస్తోంది. ఆమె చూపుల్లోనూ, పలుకుల్లోనూ చురుకుదనంలేని మందకొడితనం కనిపిస్తోంది. బరువేదో కనిపిస్తోంది. దానికితోడు నిద్రలేచి రావడంవల్ల కళ్ళు ఉబ్బి బరువుగా వున్నాయి. అందుకే సుధాకరానికి ఆమె ముఖంలో మరీ ఎక్కువగా దిగులు పరచుకున్నట్లు అనిపిస్తోంది.

'ఇక్కడ మీకీ ఉద్యోగం అంత సుఖంగా లేదనుకుంటాను' అన్నాడు సుధాకరం.

అవునన్నట్టు తలూపింది. ఆ తర్వాత 'ఏమిటోనండీ కొంతమంది జీవితంలో ఏమాత్రం సుఖానికి కూడా నోచుకోరేమో. ఎక్కడకు వెళ్ళినా ఏదో ఒక సమస్య వెన్నంటుతూనే వుంటుంది' అంది.

'మీకు యిక్కడ ఉద్యోగం చెయ్యడం కష్టంగావుంటే చెప్పండి, విశాఖలో ప్రయత్నం చేస్తాను. ఈ మాత్రం ఉద్యోగం అక్కడ దొరక్కపోదు' అన్నాడు సుధాకరం.

ఆమె బరువు కళ్ళతో దిగులుగా చూసి 'వొద్దులెండి విశాఖలో ఉద్యోగం చెయ్యడం నాకిష్టంలేదు. అక్కడ చేస్తూ చేస్తూన్న ఉద్యోగాన్నే వదులుకుని యిలా వచ్చాను' అంది.

'ఎందుకని?' అన్నాడు సుధాకరం.

ఆమె ఏమీ మాట్లాడలేదు. అంతలోనే 'అన్నట్టు, మా యిల్లు ఎలా తెలిసింది మీకు?' అని అడిగింది.

'నోట్లో నాలుకవుంటే ఎంతసేపండీ. మీ హెడ్‌మాష్టరుగారూ, సైన్సు మాష్టరుగారూ వెళ్ళిపోయాక వాళ్ళు ఏ స్కూలు వాళ్ళండీ అని ప్రెసిడెంటుగారిని అడిగాను. ఆయన చెప్పారు. మీ స్కూలుకివస్తే మీరు రాలేదని తెలిసింది. జీపువుందికదా, ఓ కుర్రాడువచ్చి యిల్లు చూపించాడు.'

లోపలినించి వాళ్ళమ్మ పిలుస్తే వెళ్ళి కాఫీ పట్టుకొచ్చింది దయ.

కాఫీతాగి 'మరిక నేను వెళ్తానండి' అంటూ లేచాడు సుధాకరం.

'సినిమా చూపించి యీ రాత్రికే వెళ్ళిపోతున్నారా?'

'లేదండి, చలిలో ఎందుకని రేపు పుదయాన్నే ఏడింటికి వెళ్ళాలనుకుంటున్నాను' అన్నాడు సుధాకరం.

'పొద్దున్న వెళ్ళేప్పుడు యిలారండి, మాయింట్లో టిఫిను చేద్దురుగాని, ఈ వూళ్ళో మంచి హోటలు కూడా లేదు' అంది.

'ఎందుకండీ మీకుశ్రమ. పైగా నేనొక్కడినేకాదు డ్రైవరూ, ఆపరేటరు కూడా వున్నారు' అన్నాడు సుధాకరం.

వాళ్ళను కూడా తీసుకురండి. ఫర్వాలేదు' అంది.

'చూస్తాలెండి. వీలుంటే తప్పక వస్తాను' అని చెప్పి సెలవుతీసుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక చాలాసేపు అతనిగురించే ఆలోచించింది ఆమె. చాలాకాలం క్రితం అతనికి తను యిచ్చిన సలహా మళ్ళీ గుర్తుకొచ్చింది.

జీవితంలో ఆశగా ఎదురుచూడ్డం అవసరమని మరీమరీ చెప్పింది. అతనికి అంత ఆశను నూరిపోసిన తను జీవితంలో తానెందుకు ఆశగా ఎదురు చూడ లేకపోతోందో ఆలోచిస్తే ఆనాటి ఆమె మాటలు ఆమెకే నవ్వు పుట్టించాయి.

ఆ రాత్రి నిద్రపోయినప్పుడు గతరోజుల జ్ఞాపకాలు నల్లులై కుట్టాయి. ఆ రాత్రి ఆమెకు సరిగ్గా నిద్రే పట్టలేదు.

దయ పొద్దున్న చీకటితోనేలేచి పప్పురుబ్బి పెసరట్లు వేసింది. అందు లోకని ఉప్మా చేసింది. అల్లంపచ్చడి కూడా చేసింది.

ఏడు గంటలకు వస్తానన్న సుధాకరం ఎనిమిదయినా రాలేదు. పొద్దున్న చలిలోలేచి పప్పురుబ్బిన శ్రమంతా ఆమెకు గుర్తుకొచ్చింది. 'చెప్పుకోదగిన పెద్ద పరిచయంకూడాలేని యీ వ్యక్తిగురించి యింత శ్రమపడాల్సిన అవసరం తనకేమిటి? నిన్న అసలు పిలవకుండానే వుండాల్సింది'– అనుకుంది. ఆమెకు చిరాకేసింది. కోపం వచ్చింది.

అసహనంగా లోపలి గదిలోంచి నడవాలోకీ, నడవాలోంచి లోపలి గది లోకి తిరుగుతూండగా సుధాకరం వచ్చాడు. వస్తూనే 'క్షమించాలి. రాత్రి సరిగా నిద్రపట్టక ఉదయం లేవడం బాగా ఆలస్యమైంది' అన్నాడు.

అతను వొక్కడే రావడం చూసి 'మీవాళ్ళు ఏరీ?' అంది.

'మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడుదామనుకొంటున్నాను. వాళ్ళు ఉంటే అంత స్వేచ్ఛగా మాట్లాడుకోడానికి వీలుండదని తీసుకురాలేదు' అన్నాడు.

దయ అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

'చెప్తాను తీరిగ్గా కూచోండి' అన్నాడు తనుకూడా కూచుని.

'వుండండి. ఇప్పటికే టిఫిన్లు చల్లారి పోయాయి. ముందవి తీసు కుందురుగాని' అని చెప్పి లోపలికి వెళ్ళి టిఫిను పట్టుకొచ్చింది. తనుకూడా దగ్గర్లోనే కుర్చీ వేసుకుని కూచుంది. ఇప్పుడు చెప్పండి ఏమిటా విషయం— అన్నట్టు అతనికేసి చూసింది.

'మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటు న్నాను' అన్నాడు సుధాకరం ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

ఆమె అదురుపాటుగా చూసింది. అబద్ధలాంటి నిజం విన్నప్పుడు కలిగే తత్తరపాటు ఆమె కంటిపాపల్లో కనిపించింది. ఆమె ఏమీ మాట్లాడలేదు. అవాక్కయి చాలా సేపు అలానే వుండిపోయింది.

'నాకు కులాలూ, మతాలూ అంటే పట్టింపులులేవు. మీ మత విశ్వాసాల్ని మీరు వొదులుకోనక్కరలేదు' అన్నాడు తిరిగి సుధాకరం.

దయ ఏమీ మాట్లాడలేక పోయింది. "ఏమంటారు—మీకు యిష్టంలేదా. ఒకవేళ మీకు యిష్టం లేకపోతే చెప్పండి. నేనేమీ అనుకోను."

దయ మెల్లగా కదిలింది.

'సుధాకరంగారూ! మీకు నా గురించి పెద్దగా తెలుసుననుకోను. నా గురించి పూర్తిగా తెలుసుకోకుండా ఇలాంటి నిర్ణయానికి రావడం మీక్కూడా అంత మంచిది కాదేమో. నేను జీవితంలో ఒకసారి మోసపోయినదాన్ని. ఆ సంగతి మీకు తెలియకపోవచ్చు. దాసు అని—మా నాన్నగారి స్నేహితుని కొడుకు. నాకు దేవుడిమీదకన్నా మనుషులమీదనే నమ్మకం ఎక్కువ. అయినా అతనిగురించనే ఆదివారం పూట తప్పనిసరిగా చర్చికి వెళ్ళేదాన్ని. ప్రేయర్ అయిపోయాక యింటివరకూ కబుర్లు చెప్పుకుంటూ వచ్చేవాళ్ళం. మా ఇంట్లో అతనికి చనువు ఎక్కువ. అతనితో సినిమాకు వెళ్ళడానిక్కూడా మా ఇంట్లో ఎలాటి అభ్యంతరమూ వుండేది కాదు అతని ప్రేమలోపడి బి.ఏ.లో నేను మొదటిసారి పరీక్ష తప్పాను. ఒకసారి మీరు అడిగినప్పుడు అబద్ధంకూడా చెప్పాను. రెండోసారి పరీక్షకివెళ్తే బొటాబొటి మార్కులు వచ్చాయి. అయినా నేనేమీ బాధపడలేదు. ఉద్యోగం చేయాల్సిన అవసరంకూడ నాకు వుండదు. ఎందుకంటే దాసు లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి కాల్టెక్స్‌లో చేరాడు. చాలా మంచి ఉద్యోగం అది. భవిష్యత్తును రంగురంగుల ఇంద్రధనుస్సులాగ ఊహించుకున్నాను. అంతలోకి మా నాన్నగారు పోయారు. ఖర్గపూర్‌లో పని చేస్తున్న మా అన్నయ్యవచ్చి నన్నూ, మా అమ్మనూ తన దగ్గరకు తీసుకు పోయాడు ఆర్నెల్లు వున్నాం. దాసు దగ్గిరనించి సరిగా వుత్తరాలు వొచ్చేవి కావు. నాకు గాభరావేసి, వివాహం గురించి దాసును తొందర పెడదామని మా అమ్మని బయలుదేరదీశాను. వూళ్ళోకి వచ్చామని తెలిసిన పదిరోజులకుగాని దాసు కలవలేదు. విషయం వివరించి చెప్పాను. త్వరలోనే ఫారిన్ ఛాన్సు

ఒకటి రాబోతున్నదనీ, అయిదారు నెలల్లో ఏ విషయమూ తేలిపోతుందనీ, అంతవరకు ఓపిక పట్టమనీ అన్నాడు. కాని అదంతా అబద్ధమని ఆలస్యంగా తెలుసుకున్నాను. కొత్తగా పరిచయమైన ఒక డబ్బున్న వాళ్ళమ్మాయి స్నేహాన్ని అది ప్రేమో కాదో తేల్చుకోడానికి అతను యీ నాలుగైదు నెలల వ్యవధిని కోరాడని అర్థమయ్యింది. ఆర్నెల్ల కిందటే ఆ అమ్మాయిని అతను పెళ్ళిచేసుకున్నాడు.'

దయ చెప్పడం ఆపి అతనికేసి చూసింది.

అతను టిఫినుకూడా తినకుండా వింటున్నాడు. దానిమీద ఈగలు కూడా ముసురుతున్నాయి.

'టిఫిను తీసుకోండి' అంది దయ అకస్మాత్తుగా మరో లోకంలోకి దిగొచ్చినట్టు.

అతను అలాగే టిఫిను తీసుకున్నాడు. మరోమాట లేకుండా మౌనంగా తినడం పూర్తిచేశాడు.

ఆమె లోపలికి వెళ్ళి కాఫీ కాసి పట్టుకొచ్చింది. అదికూడా తాగి కాఫీ గ్లాసును కింద పెడ్తూ 'చూడండి దయగారూ! నన్ను పెళ్ళి చేసుకోవడానికి మీకు ఏమైనా అభ్యంతరం వుంటే చెప్పండి. నాకు మాత్రం ఏ అభ్యంతరమూ లేదు. ఏ విషయాన్నీ మీరు వెంటనే చెప్పక్కర్లేదు. తీరిగ్గా ఆలోచించే ఉత్తరం రాయండి' అన్నాడు. ఆవిడ దగ్గరే చిన్న కాగితం తీసుకుని తన అడ్రసు రాసిచ్చాడు. ఆమె అడ్రసు కూడా తీసుకున్నాడు.

'మరిక నేను వెళ్ళొస్తానండి' అంటూ లేచాడు సుధాకరం.

'ఉండండి. మరికాస్సేపు కూచుని వెళ్దురుగాని, తొందరేం' అంది దయ.

అతను ఓసారి వాచీ చూసుకుని మళ్ళీ కూచున్నాడు.

ఓ గంట తర్వాత సుధాకరం ఆ ఇంటి చీడీలు దిగి ఎంతో హుషారుగా, ఠీవిగా, ధైర్యంగా పెద్దపెద్ద అంగల్తో గాలిలో తేలిపోతున్నట్టు తనవాళ్ళ దగ్గరికి బయలుదేరాడు.

అతన్ని సాగనంపడానికి అరుగు మీదకివచ్చి అతని దగ్గర సెలవు తీసుకుని దయ కూడా ఎంతో తేలిగ్గా, సంతోషంగా, ధైర్యంగా, తలను పైకెత్తి ఠీవిగా యింట్లోకి కదిలి వెళ్ళింది.

(1970)

★